క్లుప్తంగా

అయ్యప్పస్వామి మందిరంలో జ్యోతుల ఉత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్):దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో మకర సంక్రాంతి పురస్కరించుకుని జ్యోతుల ఉత్సవం కనులపండువగా నిర్వహించారు. బల్లెం పూర్ణయ్య గురుస్వామి స్వామివారికి విశేషంగా పూజలు, అర్చనలు చేశారు. ఆలయంలో జ్యోతులు వెలిగించి జ్యోతుల ఉత్సవం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని జ్యోతులు వెలిగించారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నవరస నటుడు శోభన్‌బాబు



విజయవాడ కల్చరల్: నవరస నటుడు శోభన్‌బాబు అని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు తెలిపారు. నగరానికి చెందిన సాంస్కృతిక కళా సంస్థల ఆధ్వర్యంలో సినీ నటుడు శోభన్‌బాబు 89 వ జయంతి గాంధీనగర్‌లోని శోభన్‌బాబు విగ్రహం వద్ద బుధవారం నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ శోభన్‌బాబు ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించారని తెలిపారు. 223 చిత్రాల్లో ఆయన నటించారని పేర్కొన్నారు. కళా సంస్థల ప్రతినిధి వీరభద్రరావు మాట్లాడుతూ ఆయన క్రమశిక్షణకు మారుపేరు అని అభివర్ణించారు. కార్యక్రమంలో చింతకాయల చిట్టిబాబు, ప్రభల శ్రీనివాస్, పైడిపాటి వెంకన్న, సింగంపల్లి వెంకటరమణ, ఆదిరాల జయప్రభ, కారుమంచి రాజు పాల్గొన్నారు. నిర్వాహకులు శోభన్ విగ్రహానికి పూలమాలలతో అలంకరించారు.

రంగవల్లులతో వీడ్కోలు




మధురానగర్(విజయవాడసెంట్రల్):సంక్రాంతి వేడుకలు బుధవారం ముగిశాయి. మధురానగర్, ముత్యాలంపాడు, మాచవరం, దుర్గాపురం, నెల రోజులుగా ఇంటి ముందు సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. కనుమ పండుగను పురస్కరించుకుని మహిళలు వారి ఇంటి ముందు రథం ముగ్గులు వేసి సంక్రాంతి పండుగకు వీడ్కోలు పలికారు.

నిరుపేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్):దుర్గాపురం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన బుధవారం ఇద్దరు నిరుపేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసి మాతృదేవోభవ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకులు బి.వసంతకుమార్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా తాము ఇక్కడ నిరుపేద విద్యార్థులకు సైకిల్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజల అవసరాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత విస్తృతంగా సేవలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కొండాయగుంట రాము, గుర్రం ఏడుకొండలు కోరంగి నాగమల్లిక తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... గతేడాది డిసెంబర్ 29న ఊరు, పేరు తెలియని ఓ వ్యక్తి బీసెంట్ రోడ్డులో అనారోగ్యంతో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో అతనిని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి వయసు 50 సంవత్సరాలు ఉంటుంది. మృతుడి ఆచూకీ తెలిసిన వారు గవర్నర్ పేట పోలీసు స్టేషన్‌ను 0866- 2576023 నంబరులో సంప్రదించాలని పోలీసులు కోరారు.

జోరుగా జూద క్రీడలు



పైపులరోడ్డు సమీపంలో కోడిపందేలు



గుండాట నిర్వహిస్తున్న దృశ్యం

- పండుగను పురస్కరించుకొని యథేచ్ఛగా కోడి పందేలు
- అధికార పార్టీ నాయకుల నిర్వహణ

పాయకాపురం(విజయవాడరూరల్): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన అధికారపార్టీ నాయకులు గత మూడు రోజులుగా పైపులరోడ్డు సమీపంలోని అంబాపురం గ్రామంలో యథేచ్ఛగా కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహించారు. అధికారపార్టీ నాయకుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి పందెంరాయళ్లకు స్వాగతం పలుకుతూ మూడురోజులుగా మూడు బరుల్లో కోడిపందేలు వేశారు. ఈ మూడు రోజుల్లో కోడిపందేలకు కోటి రూపాయల పైగా జూద క్రీడలు జరిగినట్లుగా అంచనాలు. అధికారపార్టీకి చెందిన నాయకులు గ్రూపులుగా ఏర్పడి మూడు బరులను పంచుకొని కోడిపందేలు నిర్వహించారు. కోడిపందేలతో పాటు గుండాట, లోన బైట, చినబజారు, పెద్ద బజారు లాంటి జూదక్రీడలు నిరాటంకంగా సాగాయి. బహిరంగంగానే మద్యం సేవించడం లాంటివి చోటుచేసుకున్నాయి. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోకి వచ్చే ఆ ప్రాంతంలోని పోలీసులు జూదక్రీడలను అడ్డుకున్న దాఖలాలు లేవు. భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు కోడిపందేలు, జూదక్రీడలు జోరుగా కొనసాగాయి. అధికారపార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఎవ్వరు ఏమి అనరనే ధీమాతో చోటామోటా నాయకులు పందేలు నిర్వహించారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న కొందరు యూనిఫామ్‌లో కాకుండా సాధారణ దుస్తులు ధరించి కోడిపందేల్లో పాల్గొనడం విశేషం. జక్కంపూడి గ్రామ పరిధిలో కూడా అధికార పార్టీ నాయకులు భారీగా బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు నిర్వహించారు. ముందు సమాచారంతోనే కోడిపుంజులు తీసుకొని వచ్చి పందేలు వేశారు.

యథేచ్ఛగా ఆక్రమణలు



రామకృష్ణాపురం అమ్మవారి దేవాలయం పక్కన మెరక చేసిన దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్):నగర ప్రజలందరూ పండుగ జోష్‌లో ఉన్నారు. ఎవరికి వారు పండుగ హడావుడిలో ఉంటే...కొంత మంది మాత్రం యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. 30వ డివిజన్ రామకృష్ణాపురం, జీవీఆర్‌నగర్‌లో పండుగ మాటున ఆక్రమణలు జరుగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే రామకృష్ణాపురం దుర్గాదేవి అలయం పక్కన భవన వ్యర్థాలు వేసి మెరక చేసి ఆక్రమణలకు రంగం సిద్ధం చేశారు. ఇక్కడ కొద్దికొద్దిగా బుడమేరులోకి చొచ్చుకుపోతూ ఆక్రమణలు సాగిస్తున్నారు. అలాగే గద్దే వెంకట్రామయ్యనగర్ యూజీడీ పంపింగ్ స్టేషన్ సమీపంలో బుధవారం చికెన్ దుకాణం వెలిసింది. ఇక్కడ ఏకంగా స్టీలు బడ్డీను ఏర్పాటు చేసి వ్యాపారం సాగించటం విశేషం. పట్టించుకోవాల్సిన అధికారులే పండుగ రోజుల్లో ఆక్రమణలు చేసుకోమని ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఆక్రమణల వల్ల తరచూ రాకపోకలకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీవీఆర్‌నగర్‌లో ఆక్రమణలను అడ్డుకోకుంటే పలు సమస్యలు ఉత్పన్నం అయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళా ఉత్సవ్‌లో స్టాల్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులకు విక్రయించేందుకు ఫిబ్రవరి 8 నుంచి 16వ తేది వరకు మొగల్రాజపురంలోని మొగల్ హాలులో మహిళా ఉత్సవ్–2025ను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందిన వారు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను మాత్రమే ఈ మహిళా ఉత్సవ్‌లో ప్రదర్శించి విక్రయించుకోవచ్చునని పేర్కొన్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ



డంపర్‌బిన్‌లు లేకపోవటంతో రోడ్డుపక్కన వేసిన చెత్త

మధురానగర్(దాజయదీగసెంట్రల్):29వ డివిజన్ మధురానగర్‌లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే మధురానగర్ వీవీ నరసరాజ రోడ్డులో తడి, పొడి చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన డంపర్ బిన్‌లు నిరుపయోగంగా మారాయి. ఇక్కడ డంపర్‌బిన్‌లు చెత్తలో పడి ఉన్నా పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోకపోవటం గమనార్హం. రోడ్డు పక్కన ఉండాల్సిన తడిపొడిచెత్త డంపర్ బిన్‌లు చెత్తలో కలిసిపోయాయి. అయినప్పటికీ వాటిని తీసి సరిచేయటం కానీ మరో డంపర్‌బిన్‌లను ఏర్పాటు చేయటం కానీ చేయకపోవటం పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యతారాహిత్యాన్ని తెలియచేస్తుంది. డంపర్‌బిన్‌లు లేకపోవటం వల్ల ఎవరికి వారు ఇష్టారాజ్యంగా చెత్తను పడవేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపర్‌బిన్‌లను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షిక వేడుకలు



గణాచారి ఊరేగింపులో లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దే శేషగిరిరావు, అన్నాబత్తుల శరాబందీరావు



ఊరేగింపులో ఏసీపీ దుర్గారావు

మేళతాళాలతో గణాచారి ఊరేగింపు



అంకమ్మతల్లి అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం 8వ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం అమ్మవారికి లోక కళ్యాణార్థం విశేషంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా తయారుచేయించిన అశ్వరథంపై అమ్మవారిని ఉంచి మేళతాళాలు, డప్పువాయిద్యాలు, బేతాళ సెట్టులతో మధురానగర్ పురవీధులలో గణాచారి ఊరేగింపు కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో ఏసీపీ దుర్గారావు, లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గద్దే శేషగిరిరావు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఎంతో మహిమాన్వితమైన అమ్మవారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు నెరవేరుతాయని చెప్పారు. అనంతరం గణాచారి ఊరేగింపులో పాల్గొన్నారు. అలాగే బుధవారం సాయంత్రం జ్యోతులతో పల్లకీ సేవ, విశేషంగా అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో లయన్స్ ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆంజనేయులు, శంకర్ గుప్తా, శ్రీనివాసరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.

ఘనంగా ఎన్‌సీటీసీ బైబిల్ కాలేజ్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



ప్రసంగిస్తున్న బిషప్ డాక్టర్ రాజేంద్రప్రసాద్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):ఎన్‌సీటీసీ బైబిల్ కాలేజ్ సెమినార్లు, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సింగ్‌నగర్ షాదీఖానాలో గత మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎన్‌సీటీసీ సంస్థ వ్యవస్థాపకులు, బిషప్ వర్నినెల్ ఫుల్‌వుడ్, ఈసీ డైరెక్టర్ బిషప్ డేరిక్ ఫుల్‌వుడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఆధ్యాత్మికతను ఎలా అలవర్చుకోవాలి.. ఏ విధంగా జీవించాలనే అంశాలను గురించి బైబిల్ ద్వారా వివరించారు. అంతర్జాతీయ ప్రసంగిలు, బిషప్ వై.రాజేంద్రకుమార్ పాల్గొని బైబిల్ కాలేజీ పనితీరు గురించి, విద్యార్థులకు నేర్పించిన అంశాల గురించి తెలిపారు. సంస్థ ఇండియా ఉపాధ్యక్షులు వై.సునీత,బిషప్ వై.రవి లోకేష్, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్):ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు ఆకాంక్షించారు. మకర సంక్రాంతి, కనుమ పండుగ పురస్కరించుకుని ఆయన గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ప్రతి ఇంటా మకర సంక్రాంతి సిరులు వెల్లివిరియాలని తెలిపారు. మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని కోరారు. భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మాయావతి జీవితం బహుజనులకు ఆదర్శం

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుష్పరాజ్



కేక్ కట్ చేస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుష్పరాజ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి జన్మదిన వేడుకలు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నగర కమిటీ కన్వీనర్ పి.డానియేల్ ఆధ్వర్యంలో బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్ప రాజ్ పాల్గొని బర్త్‌డే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయావతి జీవితం బహుజనులకు ఆదర్శమని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు మాయావతి కృషి చేస్తున్నారన్నారు. ఆమె నాయకత్వాన్ని బలపరుస్తూ బహుజన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పుష్ప రాజ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి దొండపాటి శామ్యూల్ కుమార్, విజయవాడ సిటీ నాయకులు ఉడుముల బుజ్జి, కె వి కోటేశ్వరరావు ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి నందిగాం రామ్మోహన్ రావు, మైలవరం నియోజకవర్గ నాయకులు కోటేశ్వరరావు, బహుజన విద్యార్థి సంఘం నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా రహదారులు



బీసెంట్‌రోడ్డులో మూతపడిన దుకాణాలు

సంక్రాంతి పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని పలు రహదారులు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే బందరురోడ్డు, ఏలూరు రోడ్డు, బీసెంట్‌రోడ్డు జనం లేక వెలవెల బోయాయి. దుకాణాలు సైతం మూతబడ్డాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



విజయవాడలో ఖాళీగా కనిపిస్తున్న బందరురోడ్డు



వెలవెలబోతున్న చల్లపల్లి బంగ్లా రోడు నుంచి ఏలూరురోడ్డు వైపు వెళ్లే మార్గం



ఖాళీగా దర్శనమిస్తున్న అప్సర థియేటర్ జంక్షన్

మార్కెట్‌లో కనుమ సందడి



విజయవాడ నగర మార్కెట్‌లలో బుధవారం కనుమ సందడి కన్పించింది. బీసెంట్ రోడ్డు మహంతి మార్కెట్ వినియోగదారులతో కిటకిటలాడింది. చేపలు, రొయ్యలు ఎక్కువగా కొనుగోలు చేశారు. చేపలు కొనుగోలు చేసి అక్కడే డ్రెస్సింగ్ చేయించుకొని తీసుకెళ్లారు. చికెన్, నాటు కోళ్లు, మటన్ విక్రయ దుకాణాలు సైతం రద్దీగా దర్శనమిచ్చాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





కనులపండువగా సీతారామ కల్యాణం



సీతారాములు కళ్యాణం



శివకేశవ దేవాలయంలో గోపూజ చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం రైల్వేకాలనీలోని శివకేశవ దేవాలయంలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యాన సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వరదరాజులు సీతారాముల కల్యాణంను వేదమంత్రాల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. బుధవారం కనుమను పురస్కరించుకుని విశేషంగా గోపూజ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు స్వామి శరణ్ పర్యవేక్షించారు.

ప్రశ్నించినవారిపై దాడులు సిగ్గుచేటు

సీపీఐ నేత ఈశ్వరయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమాజాన్ని తప్పుదారి పట్టించే మూఢవిశ్వాసాల నుంచి ప్రజలను మేల్కొలిపి వారిని మంచిమార్గం వైపు మళ్లించడమే హేతువాద ఉద్యమ లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. హేతువాదులు, ప్రశ్నించేవ్యక్తులు, జర్నలిస్టులపై పలువురు దాడులకు పాల్పతుండటం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ హేతువాది, రచయిత త్రిపురనేని రామస్వామి జయంతి సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం, త్రిపురనేని స్మారక కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ నిజాలు నిర్భయంగా మాట్లాడటం, ప్రచారం చేయడమే నేరమైతే, లేనిదాన్ని ఉన్నట్లు..అబద్ధాలను నిజం చేయాలని చూడటం పెద్ద సామాజిక నేరమని పేర్కొన్నారు. త్రిపురనేని తన ఇంటిని ఒక సాహిత్య కేంద్రంగా మార్చారని, సూత పురాణం, సంభూక వధ, వివాహ విధి వంటి సాహిత్యాన్ని అందించారని గుర్తు చేశారు. నాడు తెనాలి పురపాలక సంస్థ చైర్మన్‌గా ఉన్న రోజుల్లో సమాజంలో నెలకొన్న మూఢ విశ్వాసాలపై తనదైన కోణంలో యుద్ధం చేశారని వివరించారు. కార్యక్రమానికి అరసం కార్యదర్శి మోతుకూరి అరుణ్‌కుమార్ అధ్యక్షత వహించగా, త్రిపురనేని వారసుడు హితేష్ మాట్లాడుతూ 2019లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతికశాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం త్రిపురనేని జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాల్సి ఉండగా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాస్తిక సమాజం కార్యదర్శి కె కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 8,9 తేదీలలో మంగళగిరి చార్వాక ఆశ్రమంలో నాస్తిక మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.